# ఉచితం

'రాజా'

"ఇప్పుడు మనఊళ్లో మాంచినాటకం ఆడుతోందండీ థియేటర్ కూడా చాలాసౌకర్యంగా ఉంటుంది. మీరుతప్పకుండా చూడాల్సిన నాటకం," అన్నాడొక పెద్దమనిషి రోడ్డు మధ్య అడ్డంగా నిలబెట్టి.

నాకాశ్చర్యం వేసింది. ఏమిటిది? మనకింతకు ముందు ఏమాత్రం పరిచయం ఉన్నట్టు కనిపించదే ఈయన మొహం! తప్పించు కుందుకు నాకొక ఆలోచన తట్టింది:

"కావచ్చునుకోండి, కాని ప్రస్తుతం చేతిలో డబ్బులేదు, యిప్పుడు వెళ్ళకపోతే ఏంమునిగిపోయింది లెద్దురూ! కావాలంటే దీనితాతలాంటి సినిమాలూ, నాటకాలూ చూడొచ్చు" అన్నాను.

"మీరు మరేమీ బెంగపెట్టుకోవద్దు అప్పూచీ అంతా నాది - మీకునేను రెండు కాంప్లిమెంటరీ టిక్కెట్లు సంపాదించి పెడతాను. మేనేజర్ నాకు చాలా దగ్గిర స్నేహితుడు లెండి" అన్నాడు

మొట్టమొదటి చూపులోనే రోడ్డుకడ్డంగా ఆపి పరిచయం, తద్వార స్నేహమూ కల్పించుకునే రకం మనుష్యులంటే నాకుబొత్తిగా యిష్టంలేదు ఇదంతా అనవసరపు రభస, మాకున్న కొద్దిపాటి పరిచయంతోటే ఇతను టిక్కెట్లు సంపాదించి పెట్టే భారంవేసుకుని ఎందుకింత బాధపడు తున్నాడా అని నాకాశ్చర్యం వేసింది

కాని అతను "మేనేజరు స్నేహితుణ్ణి" అని చెప్పటం మూలాన్ని అతని మీదున్న అసహ్యాం యీపత్తూ గౌరవంగా మారింది. బహుశా ఇతని ధోరణి అంతా మంచి తనాన్నే సూచిస్తూ ఉండి ఉంటుంది.

నాదోహా రకంలెండి. నాకు కాంప్లిమెంటరీ టిక్కెట్లుపుచ్చుకుని ఉచితంగా పోడంఅనేది సుతరామూ యిష్టంలేదు. డబ్బు చేతులో వుంటే రాజాలాగ వెళ్ళక ఎందుకొచ్చింది చెప్పండి ఈతిప్పలు?

అయితే యీయన్నించి తప్పించుకునేదెలాగ? యింతలో నాకో ఆలోచన తట్టింది.

"మేంముగ్గురం వున్నామండీ! అంచేత కాంప్లిమెంటరీ టిక్కెట్లు సరిపోవుగా?" అన్నాను.

"మరేం ఫర్వాలేదు. నేను నాలుగు కాంప్లిమెంటరీ టిక్కెట్లు తెస్తాలెండి. మనంనలుగురం పోవచ్చు" అన్నాడాయన

ఎంతకీ ఈయన వదలిపెట్టే ఘటంలాగ కనిపించక పోవడంచేత చివరకి నిజం చెప్పేశాను.

"మీరు చెప్పిందానికి చాలాకృతజ్ఞుణ్ణి కాని, చూశారూ, నాకుడబ్బుపెట్టి కొనుక్కునేది లేందే ఎక్కడకీ ఉచితంగా వెళ్ళడం యిష్టంలేదు." అన్నాను.

"అసాధ్యుడు లాగవున్నారే! కాంప్లిమెంటరీ టికెట్టూ టిక్కెట్టే డబ్బుపోసి కొనుక్కున్నా టిక్కెట్టే మరేమీ ఊరికే ఆలాంటిపిచ్చి అభిప్రాయాలుపెట్టుకోవద్దు. అంతేకాదు. కాంప్లిమెంటరీ సంపాదించామంటె అందులో ఎంతదర్జా, ఎంత హోదా వుందో గమనించారా? అందుచేత మీరు ఇది కాంప్లిమెంటరీ టిక్కెట్టనిచెప్పి ఏమాత్రం వెనుదీయ నవసరంలేదు. అంతానేను చక్కచేసి రెడీగా వుంచేస్తాన్లెండి మీరు తప్పకుండా మీవాళ్ళతో రావాలి. వస్తారుకాదూ? మర్చిపోవద్దు ఆ సినిమా థియేటర్ యెదురుగుండా ఒకమఱ్ఱిచెట్టు వుంది ఆట ఆరంభించడానికి అరగంట ముందుగానే మీరక్కడ మీవాళ్ళతో సిద్ధంగావుండాలి. నేనక్కడ మీకోసం కాచుకు కూర్చుంటాను. మీరు రాకపోయారా, నేనుకూడా నాటకానికిపోను, తెలిసింది కాదూ?"

ఆయన గుక్క తిప్పుకోకుండా నా సమాధానం కోసమేనా ఎదురుచూడకుండా చక్కాపోయాడు.

సాయంత్రం ఆరున్నరకి మేం ముగ్గురమూ అంటే నేనూ, మా ఆవిడా, మా చెల్లాయీ ఆ చెట్టు క్రింద నించున్నాం. చాలా సేపు నా కళ్ళతో అంతా వెదికాను. కాని ఆ పెద్దమనిషి పికరులేదు.

మా మూడు జతల కళ్ళూ అన్ని దిక్కులూ వెదికాయి. ఇంకనేమీ చేసేదిలేక నా భార్యనీ, చెల్లాయినీ అక్కడే నిలుచుని వుండమని చెప్పి, ఆయన ఆ గేటు దగ్గిరేనా దొరుకుతాడేమో చూద్దామని గేటు దగ్గర నిలుచున్నాను.

ఆ గేటుకీ రెండువేపులా ఇద్దరు నల్లటి మనుష్యులు నిలుచుని గేటు దగ్గర కొచ్చేవాళ్ళ టిక్కెట్లు అతిజాగ్రత్తగా పరీక్షచేసి మరీ లోపలికి పంపిస్తున్నారు

నేనతి జాగ్రత్తతో వచ్చేపోయే వాళ్ళని పరీక్షగా చూస్తున్నాను గాని ఎక్కడా ఆ పెద్దమనిషే కనుపించ లేదు,

యింతలో నాకు బాగా తెలిసిన ఒకాయన కనిపించాడు "ఏమండీ, మీరు కూడా వస్తారా నాటకానికి ?" అన్నాడు

"మరేనండీ ఇదిగో ఒకాయనకోసం నిలుచున్నాను" అన్నాను

"టిక్కెట్టు కొన్నారా ?"

"ఊహుఁ, ఇంకా లేదు."

"మరి చప్పున కొనుక్కోండి. హాలు అప్పుడే నిండిపోతుంది. ఇంకా స్సేపట్లో టిక్కెట్లయిపోతాయేమో కూడా, చాలా రష్‌గా వుంది."

"అలాగే, నేనిక్కడ కొంచెం పని చూడాలి."

అతను వెళ్ళిపోయాడు వదలాడుగదా అని ఒక నిట్టూర్పు విడిచాను. నేను లోపలకీ వెళ్ళక, బయటికీ వెళ్ళక అక్కడ తటస్థంగా నించోడం అందరికీ ఆశ్చర్యం కలిగించి వుంటుంది.

ఒక చిన్న కుర్రాడు నా బూట్లు పాలిష్ చేస్తానంటూ వచ్చాడు గేటువాడు తెరయెత్తే లోగా టిక్కెట్టు కొనుక్కొమ్మని సలహా యిచ్చాడు. పిడత కిందపప్పు వాడు. "ఫోం చేసి టబ్బులియ్యండి బాబయ్యా" అన్నాడు. టాక్సీడ్రైవరు వచ్చి మళ్ళా యింటికి తీసికెళ్ళి దిగబెట్టేస్తానని చెప్పాడు

నా యీ వాలకం, టిక్కెట్టులేకుండా గేటు దగ్గిర కాయడం అంతా చూచి 'పిక్ పాకెట్' ఏమోనని అనుమానంగా చూశాడు అక్కడ నిలుచున్న మీసాల పోలీసు, నేను చివరికి నిరాశ చేసుకుని మా ఆడవాళ్ళ దగ్గిరకి వెళ్ళగానే పోలీసు తప్పుబడి పోయాడు

మేం ముగ్గురం నిస్పృహంగా, నిరాశగా ఆ చెట్టు క్రిందే నిలబడి ఉన్నాం. యింక ఆట ప్రారంభించడానికి అయిదు నిమిషాలు మాత్రమే వ్యవధి ఉంది.

యింతలో "వచ్చానయ్యా ఎలాగయితేనేం తీరుబడి చేసుకుని" అంటూ ఆ పెద్దమనిషి ప్రవేశించాడు. ఆ మాటలు తీరు చూస్తే హనుమంతుల వారు శ్రీరాముడితో చెప్పిన "కంటిన్ సీతను" అనేది జ్ఞాపకానికి వచ్చింది, నేను సంతోషంతో యించుమించు గెంతినంత పని చేశాను నా అనుచరులిద్దరూ నాపై ఇంతవరకూ చూపిస్తున్న విసుగు తగ్గించారు

"నేను చెప్పలేదూ, ఆయన వస్తాడనీ" అన్నట్టుగా మా ఆవిడ వేపు ఒకసారి చూసి, ఆయనతో "అయితే కాంప్లిమెంటరీ టిక్కెట్లు తెచ్చారా ?" అని అడిగాను

ఆయన ఒకసారి పొడి దగ్గు దగ్గి, గొంతుక సవరించుకుని (ఆయన పాటకచ్చేరీ చెయ్యాలా ఏమిటి) "ఉహుఁ, ఇంకా లేదు" అన్నాడు.

నేను తెల్లబోయి "ఆఁ! యింకా లేదూ ?" అన్నాను.

"ఇలా రండి నాతోటి నే వచ్చి కూడా మేనేజరుతో మాట్లాడి నాలుగు టిక్కెట్లు తెస్తాను" అన్నాను.

"యింత గొడవా, రద్దీ ఉంటూండగా ఈ మనిషి, ఈ పెద్దమనిషి మేనేజర్నే రప్పించగల

తాహతువున్న వాడయినట్లయితే అతను మేనేజరుకి చాలా దగ్గిర స్నేహితుడయి వుండాలి." అనుకున్నాను.

ఏమయితేనేం? ఈ గోలంతా పడి కాంప్లిమెంటరీ టిక్కెట్లు సంపాదించడానికి నామనస్సేమాత్రం ఒప్పటంలేదు కాని పెద్ద మనుష్యులతో వ్యాపారం! అందులోనూ పిడుగంత పెద్ద మనిషి-! మరినేను వెళ్ళకపోతే బాగుండదని అనుకుని తప్పనిసరిగా అయన్ని అనుసరించాను.

ఆయన గేటీకీపర్ దగ్గిరకి రొమ్ము విరుచుకుంటూ వెళ్లి నిలుచున్నాడు వాడు వెంటనే "టికెట్" అని అడిగాడు.

"నేను మేనేజర్ని చూడాలి" అని గదమాయించాడు ఆ పెద్దమనిషి.

"ఇప్పుడు కుదరదు"

"ఏం?"

"ఇప్పుడు నాటకం జరుగుతోంది."

"నేను అర్జంటుగా ఆయన్ని చూడాల్సిన అవసరంవుంది ఆయన నా స్నేహితుడు. జరుగుదువని" అని హెచ్చరించాడాయన గేట్ కీపర్ని.

వాడు వెంటనే భయపడుతూ లోపలికి వెళ్లి కాస్సేట్లో మేనేజరుతోసహా తిరిగివచ్చాడు.

ఇదంతా నాకు అవమానకరంగావుంది. మేనేజర్ నలభై ఏళ్ళ మనిషి. చక్కటి సూట్ వేసుకున్నాడు; ఫ్రేమ్‌లేని కళ్ళద్దాలు పెట్టుకున్నాడు. తలని అతిశ్రద్ధగా దువ్వుకున్నాడు! వేషాలు వేయించే వాడయినా తనే వేషధారిలాగ వున్నాడు. ఏమీ ఎరగనట్టు మొహంపెట్టి మా పెద్దమనిషిని అడిగాడు.

"ఎవరు మీరు?"

నేనూ, మా అను చారిణులూ యిది చూసి తెల్లబోయాం.

"ఏమిటీ? అః? మీరు నన్నెరగరూ?"

పెద్దమనిషి ఇంచుమించుగా మొరిగాడు.

మేనేజర్ ఆయన్ని ఎగాదిగాచూసి, ఎక్కడా చూసినట్టు జ్ఞాపకం లేదే?" అన్నాడు.

"మునిద్దరం ఆవేళ ట్రెయిన్లో కలిసి ప్రయాణం చేశాం. జ్ఞాపకం లేదూ?"

"ఊఁ, అయితే?

"ఆవేళ మీరు నాకొక కాంప్లిమెంటరీ టిక్కెట్టిస్తానని చెప్పలేదూ?"

"ఓహో, అన్నాను కాబోలు, అయితే రండి లోపలికి"

"కాని . "

"ఇంకా ఏమిటి?" విసుగ్గాచూసాడు. మేనేజర్, మేమిద్దరం చూసి నవ్వాలో ఏడవాలో కూడా తెలియటం లేదు.

"నాతో యింకా ముగ్గురున్నారు"

అ వేళ నేను మీ స్నేహితులకి కూడా కాంప్లిమెంటరీ యిస్తానని చెప్పానా?"

"ఆఁ"

"అయితే ఎక్కడా?"

ఈలోపుగ ఏమిగోలో అయిపోతోందని మా చుట్టూ అనేకులు గుమిగూడి మమ్మల్ని వింత మృగాల్ని చూస్తున్నట్టు చూస్తున్నారు

పెద్దమనిషి మమ్మల్ని మేనేజర్‌కి చూపించాడు అప్పుడు మేం నిజంగా కుంగిపోయాం సిగ్గుతో తలెత్తలేకపోయాం. చుట్టూవున్న జనం అంతా మమ్మల్ని చూసి హేళనగా నవ్వుతూంటే అక్కడ నిలవడానికి మనసే ఒప్పలేదు, నా కాళ్లు తేలిపోతున్న ట్లనిపించింది,

మేనేజర్ విసుగ్గా. "అయితే మీరెళ్ళండి లోపలికి" అని అరిచాడు, తర్వాత మెల్లిగా. "బాదరాయణ సంబంధం!" అని మాకు వినిపించేట్టు అన్నాడు

మొత్తానికి మమ్మల్ని చివరిక్లాసులోకే తోసేశారు.

కాని ఏ క్లాసయితేనేం? ఆ రాత్రి ఏం నాటకం చూశామో మాముగ్గురికీ కూడా తెలియదు!